తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్ కావాలి

- జమ్మూ సీఎం అబ్దుల్లా

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌ను తనను ఆహ్వానించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ధన్యవాదలు చెప్పారు. ఈ సమ్మిట్‌కు నేను హాజరు కాక పోయినా.. కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటానని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. కాగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, మిర్ఖాన్‌పేటలో డిసెంబర్ 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమ్మిట్‌ను దావోస్ సమ్మిట్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిఅధికారులను ఆదేశించారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవాలని, భవిష్యత్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా 500 కంటే ఎక్కువ పెద్ద కంపెనీలు, 2000 పైగా వ్యాపారవేత్తలు, నాయకులు, నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు రండి.. సీఎం స్టాలిన్ కు ఉత్తమ్ ఆహ్వానం

విశ్వంభర, చెన్నై: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో భేటీ అయ్యారు. ఈ నెల 8,9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించబోతున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇవాళ చెన్నైలోని సీఎం కార్యాలయంలో స్టాలిన్‌ను కలిసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ మేరకు ఆహ్వానం అందించారు. అయితే తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ పేరుతో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ ఈవెంట్ కు ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువుకు కేంద్ర మంత్రులను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆహ్వానించారు. ఇక అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఈ బాధ్యతను మంత్రులకు అప్పగించారు.

అమెరికాలో అగ్నిప్రమాదం.. ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : అమెరికాలో ఇద్దరు తెలుగు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. ఉన్నత చదువుల కోసం యూఎస్ వెళ్లిన విద్యార్థులు.. బర్మింగ్‌హామ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో మృత్యువాతపడ్డారు. మృతులిద్దరూ హైదరాబాద్ వాసులే కావడం గమనార్హం. మృతులను ఉడుముల సహజ రెడ్డి కాగా, మరో విద్యార్థినిని కూకట్ పల్లికి చెందిన యువతిగా గుర్తించారు. వీరంతా మరికొందరు తెలుగు విద్యార్థులతో కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో నివశిస్తున్నారు. ఈ భవనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనలకు గురై కేకలు వేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వచ్చి అపార్ట్‌మెంట్లోని వారిని బయటకు తీసుకొచ్చారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న వారందర్నీ వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థినిలు మరణించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్లో పది మంది తెలుగు విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. వీళ్లంతా అలబామా యూనివర్సిటీలో చదువుకుంటున్నారు.

త్వరలో కొమురవెల్లికి రైల్వే స్టేషన్..

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : కొమురవెల్లి మల్లన్న స్వామి భక్తులకు త్వరలో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ తెలిపారు. భక్తులకు రైలు సౌకర్యం అందించేందుకు మనోహరాబాద్ కొత్తపల్లి నూతన బ్రాడ్ గేజ్ లైన్‌లో కొమురవెల్లి రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్ సిద్దిపేట సెక్షన్‌ను తనిఖీలో భాగంగా కొమరవెల్లి నూతన స్టేషన్ భవనం పనులను సమీక్షించి, ప్రాజెక్టును నిర్ణీత లక్ష్యంలోగా పూర్తి చేయడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను సమీక్షించారు. ఈ విభాగంలోని కొన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్‌లను పరిశీలించారు. సిద్దిపేట రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా చేసిన తనిఖీలో, ప్రయాణీకుల సౌకర్యాలను సమీక్షించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సర్క్యులేటింగ్ ప్రాంతం, రిలే గదిని పరిశీలించారు. సిద్దిపేట సిరిసిల్ల మధ్య జరుగుతున్న కొత్త రైల్వే లైన్ పనుల పరిశీలనలో ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను సమీక్షించారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు జోన్, డివిజన్‌కు చెందిన సీనియర్ రైల్వే అధికారులు కూడా ఉన్నారు.

ఐదేళ్ల ప్రణాళికకు భారత్, రష్యా ఆమోదం

- పుతిన్‌తో, మోడీ శిఖరాగ్ర భేటీ
- 11 కీలక ఒప్పందాలపై ఇరు దేశాల సంతకాలు
- 100 బిలియన్ డాలర్లకు 'వాణిజ్య బంధం' పెంచుకోవాలని తీర్మానం
- దిల్లీ-మాస్కో స్నేహం ధ్రువతారగా వెలుగులీనుతోందన్న ప్రధాని
- ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం ఆవశ్యకమని వ్యాఖ్య
- అవసరమైతే అందుకు సహకరిస్తామని ప్రకటన
- భారత్‌కు నిరంతర ఇంధన సరఫరాకు సిద్ధమన్న పుతిన్

విశ్వంభర, నేషనల్ బ్యూరో : కాలం పెట్టిన అనేక కఠిన పరీక్షలను సమర్థంగా ఎదుర్కొన్న తమ మైత్రీ బంధాన్ని 'ఆర్థిక' పునాదులపై మరింత పటిష్ఠంగా మార్చుకోవాలని భారత్, రష్యా తాజాగా తీర్మానించుకున్నాయి. ఇందుకోసం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను ఇంకా బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి. ఆ దిశగా ఐదేళ్ల కాలానికిగాను '2030 ఆర్థిక కార్యక్రమం' ప్రణాళికకు తుదిరూపునిచ్చాయి. భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం జరిపిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య మొత్తం 11 కీలక ఒప్పందాలు కుదిరాయి. ఆరోగ్యం, ఆహార భద్రత, నౌకాయానం, ఎరువులు, విద్య, భారత్ నుంచి రష్యాకు నిపుణులైన కార్మికుల వలస తదితర రంగాల్లో పరస్పర సహకారం పెంపునకు ఇవి దోహదపడనున్నాయి. మాస్కోతో వాణిజ్య లోటును పూడ్చుకోవడంలో దిల్లీకి సాయపడనున్నాయి. భౌగోళిక రాజకీయాలు ఎన్నెన్నో కుదుపులకు లోనైనప్పటికీ.. భారత్‌రష్యా స్నేహం ధ్రువతారలా నిరంతరం వెలుగులీనుతూనే ఉందని పుతిన్‌తో భేటీలో మోదీ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత మార్గాల్లో ముగింపు పలకాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. భారత్‌రష్యా బిజినెస్ ఫోరమ్‌లోనూ మోదీ, పుతిన్ పాల్గొన్నారు.

మరింతగా ఆర్థిక సహకారం: మోడీ..

"గత 8 దశాబ్దాల్లో ప్రపంచం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. మానవాళి అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొంది. వాటన్నింటినీ తట్టుకుంటూ భారత్‌రష్యా మైత్రి ధ్రువతారలా నిలిచి ఉంది. పరస్పర గౌరవం, బలమైన విశ్వాసం అనే పునాదులపై ఈ బంధం నిర్మితమైంది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై పుతిన్, నేను చర్చించాం. ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లడం మాకు ప్రాధాన్యాంశం. అందుకు అనుగుణంగా 2030 వరకు అనుసరించాల్సిన 'ఆర్థిక సహకార కార్యక్రమం'పై సంతకాలు చేశాం. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను మరిన్ని రంగాలకు విస్తరిస్తాం" అని పుతిన్‌తో భేటీ అనంతరం సంయుక్త విలేకర్ల సమావేశంలో మోదీ పేర్కొన్నారు. రష్యా పౌరులకు ఉచితంగా 30 రోజుల ఈటూరిస్టు వీసా, 30 రోజుల గ్రూపు టూరిస్టు వీసాలను త్వరలో భారత్ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత్, రష్యా మధ్య అనుసంధానతను పెంచుకోవడానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. అంతర్జాతీయ ఉత్తరదక్షిణ రవాణా నడవా (ఐఎన్ఎస్‌టీసీ), ఉత్తర సముద్ర మార్గం, చెన్నై వ్లాదివోస్తాక్ నడవాల విషయంలో నూతనోత్తేజంతో ముందుకెళ్తామన్నారు. భారత్, రష్యా మధ్య మానవ వనరుల రాకపోకలను సులభతరం చేసేలా రెండు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు.

ఉక్రెయిన్ సంక్షోభంపై చర్చ..

మోదీపుతిన్ భేటీలో ఉక్రెయిన్ యుద్ధం అంశం కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. ఉక్రెయిన్‌లో శాంతిని భారత్ ముందునుంచీ కాంక్షిస్తున్న విషయాన్ని మోదీ గుర్తుచేశారు. అక్కడ శాంతి స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఢిల్లీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ తటస్థంగా కాకుండా, శాంతివైపే ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. "ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచీ మనం చర్చలు జరుపుతూనే ఉన్నాం. అక్కడి పరిస్థితిని ఆత్మీయ మిత్రుడిగా మీరు మాకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే ఉన్నారు. విశ్వాసమే ప్రధాన బలమైని నేను భావిస్తున్నా. మనమంతా శాంతిమార్గాన్ని ఎంచుకోవాలి. యుద్ధం ముగింపునకు కొంతకాలంగా జరుగుతున్న ప్రయత్నాల గురించి నాకు తెలుసు. ప్రపంచంలో శాంతి నెలకొంటుందని విశ్వసిస్తున్నా. ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడంలో మేం సహకరిస్తాం" అని పుతిన్‌తో భేటీలో మోదీ వ్యాఖ్యానించారు. దీంతో పుతిన్ స్పందిస్తూ.. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కోసం మాస్కో ప్రయత్నిస్తోందని తెలిపారు.

పహల్గాం దాడిని ఖండించిన రష్యా అధ్యక్షుడు..

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే మార్గాలపైనా మోదీ, పుతిన్ చర్చించారు. రహస్య ఎజెండాలు, ద్వంద్వ ప్రమాణాలకు తావు లేకుండా.. ఉగ్రవాదంపై ప్రపంచం రాజీ లేని పోరాటం చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఉగ్ర రక్కసిపై భారత్, రష్యా దీర్ఘకాలంగా భుజం భుజం కలిపి పోరాడుతున్నాయని గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో, మాస్కోలోని క్రాకస్ సిటీ హాల్‌పై జరిగిన ఉగ్రదాడులను పుతిన్ ఖండించారు. భారత్‌రష్యా సంబంధాలను బలోపేతం చేయడంలో పుతిన్ రెండున్నర దశాబ్దాలుగా దృఢమైన చిత్తశుద్ధి కనబరుస్తున్నారంటూ మోదీ ప్రశంసించారు. పెట్టుబడుల ప్రోత్సాహం, పరిరక్షణపై ఉభయ ప్రయోజన కర ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు వేగవంతం చేయాలని ఇరు దేశాల అధికారులను మోదీ, పుతిన్ ఆదేశించారు. భారత్, యూరేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య సరకు రవాణాపై స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ముమ్మరంగా కృషి జరుగుతుండటాన్ని ఇరువురు నేతలు అభినందించారు. రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారతీయులను విడుదల చేయాలని పుతిన్‌ను మోదీ కోరారు.

భారతీయ ఉత్పత్తులకు మరింతగా మార్కెట్ ప్రవేశం: పుతిన్

ద్వైపాక్షిక వార్షిక వాణిజ్య బంధం విలువను ప్రస్తుతమున్న 64 బిలియన్ డాలర్ల నుంచి.. 2030 కల్లా 100 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచుకోవాలని భారత్, రష్యా ప్రణాళికలు రచిస్తున్నట్లు పుతిన్ తెలిపారు. "దిల్లీ ఇంధన అవసరాలను తీర్చేందుకు చమురు, గ్యాస్, బొగ్గు వంటివాటిని సరఫరా చేసే విశ్వసనీయ భాగస్వామిగా మాస్కో ఉంది. భారతీయ ఉత్పత్తులకు మరింతగా మార్కెట్ ప్రవేశం కల్పిస్తాం.అణు సాంకేతికతలను ఔషధాలు, వ్యవసాయం వంటి ఇంధనేతర రంగాల్లో ఉపయోగించుకోవడంలో భారత్‌కు మేం సహాయం చేయగలం" అని ఆయన పేర్కొన్నారు. రష్యా, భారత్, మరికొన్ని భావసారూప్య దేశాలు బహుళ ధ్రువ ప్రపంచం కోసం కృషిచేస్తున్నాయని చెప్పారు.

రాజ్‌ఘాట్ సందర్శన: మోదీతో శిఖరాగ్ర భేటీకి ముందు.. పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. ఆయనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆత్మీయ స్వాగతం పలికారు. త్రివిధ దళాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం రష్యా అధ్యక్షుడు రాజ్‌ఘాట్‌ను సందర్శించి పుష్పాంజలి ఘటించారు.

కాళోజీ హెల్త్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా డా. రమేష్ రెడ్డి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : కాళోజీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్ఆర్ యూహెచ్ఎస్) ఇంచార్జ్ వీసీగా డా. రమేష్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. రమేష్ రెడ్డి ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా ఉన్నారు. గతంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) గానూ పనిచేశారు. గత నెల 28న కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి ఆ పదవికి రాజీనామా చేశారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను అక్రమంగా పాస్ చేశారని, ఇంచార్జిల నియామకంలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే వీసీ పదవికి రాజీనామా చేసిన మరుసటి రోజే తిరిగి యూనివర్సిటీకి వచ్చి.. కొత్త వీసీ వచ్చే వరకు తనసే ఆపద్ధర్మ వీసీగా కొనసాగమన్నారంటూ ఆయనే మీడియాకు చెప్పారు. తాను ఏ తప్పు చేయలేదని, ఎటువంటి విచారణకైనా సిద్ధమేనని పేర్కొన్నారు. అయితే వర్సిటీని గాడిన పెట్టాలని కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఎట్టకేలకు ఇప్పుడు ఇంచార్జ్ వీసీని నియమించింది. గతంలో డీఎమ్ఈగా పనిచేసిన అనుభవం ఉన్న రమేష్ రెడ్డిని యూనివర్సిటీ పాలన వ్యవస్థను సరిచేసేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావించడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే వైద్య విద్యలో విశేష అనుభవం ఉన్న డా. రమేష్ రెడ్డి అయినా అస్తవ్యస్తంగా మారిన కాళోజీ వర్సిటీని గాడిన పెట్టి వైద్య విద్యను పట్టాల పైకి ఎక్కిస్తారని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. కాళోజీ వర్సిటీ పరిధిలో ఈ ఏడాది పీజీ అడ్మిషన్లలో ఇంకా గందరగోళం నడుస్తోంది. నీట్ పీజీ రెండు దశల కౌన్సిలింగ్ (ఆల్ ఇండియా కోటా కౌన్సిలింగ్ మరియు స్టేట్ కోటా కౌన్సిలింగ్) లో పాల్గొనేందుకు మిగతా రాష్ట్రాల విద్యార్థుల మాదిరిగా తెలంగాణ విద్యార్థులకు అవకాశం లేకుండా పోతోంది. కోర్టు కేసుల పేరిట కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు ఏ మాత్రం పట్టింపు లేనట్లుగా వ్యవహరించడంతో స్టేట్ కోటా కౌన్సిలింగ్ ప్రారంభమే కాకుండా పోయి.. తెలంగాణ విద్యార్థులు కేవలం ఆల్ ఇండియా కోటా కౌన్సిలింగ్ కే పరిమితం కావాల్సి వస్తోంది. దీంతో ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీ

వంటి ఎంతో మెరుగైన పీజీ సీట్లను కోల్పోవాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా వర్సిటీకి ఇంచార్జి వీసీ రావడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో అనుభవం ఉన్న డా.రమేష్ రెడ్డి వల్ల తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు.

పీజీ విద్యార్థుల సమస్య పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం.. ఇంచార్జ్ వీసీ డా. రమేష్ రెడ్డి

నీట్ పీజీ ఆల్ ఇండియా కోటా కౌన్సిలింగ్ కు సమాంతరంగా స్టేట్ కోటా కౌన్సిలింగ్ కూడా జరగకపోతే మన విద్యార్థులు ఎంతో నష్టపోతారని, అందుకే ఈ విషయంలో మన రాష్ట్ర విద్యార్థులకు న్యాయం చేసేందుకు వెంటనే కార్యాచరణ ప్రారంభిస్తామని ఇంచార్జ్ వీసీ డా. రమేష్ రెడ్డి 'దిశ పత్రిక'కు తెలిపారు. ఎంతో కష్టపడి మంచి ర్యాంకులు తెచ్చుకున్న మన విద్యార్థులకు వారి ర్యాంకులకు తగ్గట్లుగా సరైన ప్రాధాన్యత ఉన్న పీజీ సీట్లు దక్కేలా చేయడం తమ బాధ్యత అని, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలే తమకు ప్రథమ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. అందుకే వెంటనే బాధ్యతలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వైద్య విద్యా వ్యవస్థను సవ్యంగా నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సీఎం ఆదేశిస్తే రాజీనామాకు సిద్ధం

- ఎమ్మెల్యే దానం సంచలన వ్యాఖ్యలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదుపై సమాధానం ఇచ్చేందుకు తమకు మరింత గడువు ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఇటీవలే ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆయన తన రాజీనామాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశిస్తే.. ఇప్పటికిప్పుడు రాజీనామా చేసేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేయడం.. పోరాడటం తనకేమీ కొత్త కాదని కామెంట్ చేశారు. ఇప్పటి వరకు 11 సార్లు ఎన్నికల్లో పోటీ చేశానని అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత కేసుపై సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయని తెలిపారు. మరో పదేళ్ల పాటు సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటేనే అభివృద్ధి సాధ్యమని దానం నాగేందర్ అన్నారు.

ఎట్టకేలకు హైకోర్టుకు హాజరైన హైడ్రా చీఫ్ రంగనాథ్

విశ్వంభర, హైదరాబాద్ : అంబర్‌పేటలోని బతుకమ్మకుంట పరిరక్షణకు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం తెలంగాణ హైకోర్టులో వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఈ మేరకు కోర్టు ఆదేశాల ఉల్లంఘనతో తాను తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ రంగనాథ్ ధర్మాసనం ఎదుట క్షమాపణలు చెప్పారు. కోర్టు ఆదేశాలు తెలియకుండానే పనులు జరిగాయని, ఇలాంటి పొరపాటు భవిష్యత్తులో జరగకుండా చూసుకుంటామని ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రంగనాథ్ పూర్తి వాదనలను విన్న తర్వాత ధర్మాసనం ఆయన క్షమాపణను రికార్డు చేసుకుంటూ కంటెంప్ట్ పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే, ఈ కేసులో ఇతర అంశాలపై తదుపరి విచారణకు ఈనెల 18కి కోర్టు వాయిదా వేసింది.కాగా, జూన్ 12న బతుకమ్మకుంట పరిరక్షణకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కో ఆదేశాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించినట్లుగా ఆరోపిస్తూ భూ యజమాని ఎడ్ల సుధాకర్ రెడ్డి హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కోర్టు నుంచి ఆదేశాలు జారీ అయిన తర్వాత కూడా హైడ్రా అధికారులు ఆ భూమిపై బుల్‌డోజర్లతో పనులు కొనసాగించారని పిటిషనర్ ఆరోపించారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు ధర్మాసనం గత విచారణలో భాగంగా రంగనాథ్‌ను వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాల్సిందిగా ఆదేశించింది.

హైదరాబాద్‌లో సమన్వయంతోనే వాయు నాణ్యత

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : హైదరాబాద్ మహానగరంలో ఎయిర్ క్వాలిటీని మెరుగుపర్చడానికి అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జీహెచ్ఎంసీ అదనపుకమిషనర్ సీఎన్.రఘుప్రసాద్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్సీఏపీ) కింద నగర స్థాయి మానిటరింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (సీఎల్ఎంఐసీ) సమావేశం శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ సీఎన్. రఘు ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ), టీజీఎస్ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్, సివిల్ సప్లైస్, ట్రాన్స్‌పోర్ట్ శాఖ, టీజీఐఐసీ, ఈపీటీఆర్ఐ, సీపీబీసీ (ఎన్సీఏపీ) సాంకేతిక నిపుణులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో నగరంలోని కాలుష్య హాట్‌స్పాట్లదేటా సమీక్ష, సిటీ యాక్షన్ ప్లాన్ పురోగతి పరిశీలన, సూక్ష్మ స్థాయి వ్యూహాలు, రోడ్డు ధూళి తగ్గింపు, వాహనాల ఉద్గారాల నియంత్రణ, పరిశ్రమల కాలుష్య

నియంత్రణ, నిర్మాణాల కూల్చివేత వ్యర్థాల సమర్థ నిర్వహణ, పచ్చదనం విస్తరణ, ప్రధాన నిర్మాణ ప్రదేశాల్లో రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రఘు ప్రసాద్ మాట్లాడుతూ.. వాయు నాణ్యతను మరింతగా మెరుగుపరిచేందుకు ప్రభుత్వ శాఖలు, విభాగాల మధ్య సమన్వయం, నిర్దేశిత చట్టాల అమలు అవసరమని పేర్కొన్నారు. టీజీపీసీబీ శాస్త్రవేత్తలు డా. ప్రసాద్ దాసరి, ఎన్. జయశ్రీలు ప్రధాన హాట్‌స్పాట్లలో తక్షణ, దీర్ఘకాలిక చర్యలు అవసరమని సూచించారు. ముఖ్యంగా పంజాగుట్ట, పటాన్ చెరువు కారిడార్, చార్మినార్-నాంపల్లి హెరిటేజ్ జోన్, హైటెక్ సిటీ ట్రాన్సిట్ కారిడార్, ఎంజీబీఎస్-సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లలో పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. వాయు కాలుష్యం తగ్గించేందుకు అధిక ట్రాఫిక్, అధిక కాలుష్య ప్రాంతాల్లో టీజీఎస్ఆర్టీసీ ద్వారా మరిన్ని ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశపెట్టడం, సంప్రదాయ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ మూడు చక్ర వాహనాలతో భర్తీ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీంతోపాటు అన్ని వాహనాలకు తప్పనిసరి పీయూసీ సర్టిఫికేట్, పాత వాహనాలపై కఠిన తనిఖీలు, టెలికాం నగర్, ఇంద్రమ్మ నగర్ వంటి కీలక ట్రాఫిక్ ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు (ఎఫ్ఓబీ), పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు, పౌరులు తమ నిర్మాణ వ్యర్థాలను జీహెచ్ఎంసీ అధీకృత సంస్థలకు (రామ్‌కీ, సోమ శ్రీనివాస్ రెడ్డి) తక్కువ ధరలకు అప్పగించడం, రీసైకిల్ చేసిన నిర్మాణ పదార్థాల వినియోగం వంటివి చేపట్టాలని రఘుప్రసాద్ అన్నారు. ప్లాస్టిక్, ఇతర మున్సిపల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చడంపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక స్వచ్ఛ గాలి సాంకేతికతలను అవలంబించాలని, ఎన్సీఏపీ కార్యక్రమాలను వేగంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. పౌరులు తమ సీఅండ్ డీ వ్యర్థాల తరలించడానికి టోల్ ఫ్రీ నంబర్లలో 1800 120 1159, 1800 203 0033, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా అధికారులు కోరారు.